సాక్షి
నిర్మల్

శుక్రవారం, 31, మే, 2024



కొత్త ఊళ్లో.. ఎట్ల బతుకుడు?
కవ్వాల్ టైగర్ జోన్‌లోని రాంపూర్, మైసంపేట్ వాసులు పులి మనుగడ కోసం ఊళ్లను ఖాళీ చేశారు. అయితే వీరికి అందించిన సాగు భూములను ఇప్పటికీ సిద్ధం చేయలేదు. 8లో▸



సృజనాత్మకం..వేసవి శిక్షణ..!
విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు, వచ్చే విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
42.8 /31.5
ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. ఉదయం నుంచే వేడి తీవ్రంగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది.

స్టాంపింగ్ దందా!?

భైంసా పట్టణంలోని ఓ వర్తక సంఘం దుకాణాల నుంచి ఎలక్ట్రానిక్ కాంటాలకు స్టాంపింగ్ పేరిట తూనికలు, కొలతల శాఖ లైసెన్స్‌డ్ రిపేరర్ మూడు నెలల క్రితం డబ్బులు వసూలు చేశారు. ఒక్కో కాంటాకు రూ.1500 చొప్పున తీసుకున్నట్లు సమాచారం. అయితే, ఇప్పటివరకు కాంటాలకు స్టాంపింగ్ చేయకపోగా, ధ్రువీకరణ పత్రం కూడా ఇవ్వలేదు. మరో వర్తక సంఘం దుకాణాల నుంచి సైతం దాదాపు ఏడాది కిందట స్టాంపింగ్ పేరిట డబ్బులు తీసుకుని ఇప్పటికీ ధ్రువీకరణ పత్రాలు అందించలేదని దుకాణదారులు ఆరోపిస్తున్నారు.

జిల్లాలో వేల సంఖ్యలో దుకాణాల్లో ఎలక్ట్రానిక్ కాంటాలు వినియోగిస్తున్నారు. వీటిలో చాలావరకు సీలు లేనివి ఉన్నాయి. తూనికలు, కొలతల శాఖ అధికారులు గతంలో స్టాంపింగ్ చేసిన కాంటాలకే రెన్యూవల్ చేస్తున్నారు. ఎవరైనా స్టాంపింగ్ చేయాలని కోరితేనే స్టాంపింగ్ చేస్తున్నారు.. తప్ప అసలే సీలు లేని కాంటాలు ఏళ్లుగా వినియోగిస్తున్నా వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. ఫలితంగా స్టాంపింగ్ రుసుం రూపంలో తూనికలు, కొలతల శాఖకు రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది.

- వసూళ్లకు పాల్పడుతున్న సిబ్బంది..
- నెలలు గడుస్తున్నా వ్యాపారులకు అందని ధ్రువపత్రాలు
- తూనికలు, కొలతల శాఖలో నిర్వాకం

భైంసాటౌన్: జిల్లాలో తూనికలు, కొలతల శాఖ ఇన్‌చార్జి అధికారి బాధ్యతలతో పూర్తిస్థాయిలో సమయం కేటాయించలేకపోతున్నారు. ఇతర జిల్లాల బాధ్యతలు ఉండడం, జిల్లాకు ఇన్‌చార్జి అధికారి కావడంతో కిందిస్థాయిలో కొందరు సిబ్బంది, లైసెన్స్‌డ్ కాంటా రిపేరర్ల ఇష్టారాజ్యం నడుస్తోంది. శాఖలోని సిబ్బంది కొందరు లైసెన్స్‌డ్ కాంటా సర్వీస్ నిర్వాహకులతో కలిసి కాంటాలకు స్టాంపింగ్ పేరిట క్షేత్రస్థాయిలో డబ్బులు వసూలు చేస్తున్నారు. జిల్లా అధికారి సమక్షంలో కాంటాలకు సీలు వేసి స్టాంపింగ్ వేయాల్సి ఉండగా, నెలలు గడుస్తున్నా స్టాంపింగ్ వేయడం లేదు. అధికారికంగా ధ్రువీకరణ పత్రాలూ అందించడం లేదు. దీంతోపాటు చాలావరకు కాంటాలకు సంబంధించి స్టాంపింగ్ రుసుం వసూలు చేసి, కొన్ని మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేసి, మిగిలిన వాటి సొమ్మును కాజేస్తున్నట్లు తెలుస్తోంది.

రెగ్యులర్ అధికారి లేక...
జిల్లా కేంద్రమైన నిర్మల్‌తోపాటు భైంసా, ఖానాపూర్ పట్టణాల్లో వేల సంఖ్యలో దుకాణాలున్నాయి. కిరాణ, మాంసం, కూరగాయలు, పండ్లు, స్వీట్‌హోం, హార్డ్‌వేర్, సిల్వర్/గోల్డ్ మర్చంట్స్.. ఇలా ఎన్నో దుకాణాల్లో ఎలక్ట్రానిక్, మ్యానువల్ కాంటాలున్నాయి. వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడకుండా తూనికలు, కొలతల శాఖ ఆధ్వర్యంలో ఏటా కాంటాలను తనిఖీ చేసి, తేడాలుంటే సరిచేసి స్టాంపింగ్ వేస్తారు. ఇందుకుగాను నిర్ణీత రుసుం వసూలు చేస్తారు. జిల్లాకు రెగ్యులర్ అధికారి లేకపోవడంతో శాఖకు పూర్తిస్థాయిలో ఆదాయం చేకూరడం లేదు. దీనికి తోడు తనిఖీలు సైతం లేకపోవడంతో తూకాల్లో మోసాలపై పర్యవేక్షణ కొరవడుతోంది. ఇదే ఆసరాగా చేసుకుంటున్న కాంటా రిపేరర్లు, కిందిస్థాయి సిబ్బంది కొందరు క్షేత్రస్థాయికి వెళ్లి కాంటాలకు స్టాంపింగ్ పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారు. తీరా స్టాంపింగ్ చేయకుండా ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుం పక్కదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈనెల 28న లోకేశ్వరం మండలంలో జిల్లా తూనికలు, కొలతల శాఖలో పనిచేసే టెక్నికల్ అసిస్టెంట్, ఆథరైజ్డ్ లైసెన్స్‌డ్ కాంటా రిపేరర్‌తో కలిసి స్టాంపింగ్ పేరిట డబ్బులు వసూలు చేశారు. కానీ, కాంటాలకు మాత్రం స్టాంపింగ్ చేయలేదు. ఈ విషయమై జిల్లా తూనికలు, కొలతల శాఖ ఇన్‌చార్జి అధికారిని ఫోన్‌లో వివరణ కోరగా, తన ఆదేశాల మేరకే వారు కాంటాల స్టాంపింగ్ నిమిత్తం లోకేశ్వరం వెళ్లినట్లు పేర్కొన్నారు. అయితే, కాంటాలకు స్టాంపింగ్ చేయలేదని తెలుపగా, తాను వచ్చినప్పుడు చేస్తానని మాట మార్చారు. అలాగే జిల్లాలో తూనికలు, కొలతల శాఖకు సంబంధించి ఆదాయం వివరాలు కోరగా, తనకు నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి బాధ్యతతోపాటు మరో జిల్లా రెగ్యులర్ బాధ్యతలున్నాయని, పనిలో బిజీగా ఉన్నానని సమాధానమిచ్చారు.



ఓ దుకాణంలో సీలు లేని ఎలక్ట్రానిక్ కాంటా

'పుర' మహిళా కమిటీలు

- పని ప్రదేశాల్లో రక్షణ కోసం ఏర్పాటు
- ఉత్తర్వులు జారీ చేసిన మున్సిపల్ శాఖ

నిర్మల్‌చైన్‌గేట్: పని ప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులను అరికట్టేందుకు అంతర్గత మహిళా కమిటీలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధానంగా మహిళా ఉద్యోగులపై వేధింపులు జరుగుతున్నట్లు రాష్ట్ర వ్యాప్తంగా ఆరోపణలు వస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకుంది. మహిళా ఉద్యోగుల రక్షణపై ప్రత్యేక దృష్టి పెడుతోంది. మున్సిపాలిటీల్లో అంతర్గత మహిళా కమిటీలు ఏర్పాటు చేయాలని ఏప్రిల్ 29న మున్సిపల్ శాఖ సంబంధిత మున్సిపల్ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే మొన్నటి వరకు లోక్‌సభ ఎన్నికల విధుల్లో ఉండడంతో కమిటీల ఏర్పాటుపై ముందడుగు పడలేదు. ఇప్పుడు ఎన్నికలు పూర్తి కావడంతో అంతర్గత మహిళా కమిటీలు వేసేందుకు మున్సిపల్ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

కమిటీల్లో వీరు..
పురపాలికల్లో మహిళా ఉద్యోగులకు తగిన రక్షణ కల్పించేందుకు 2013లో జారీ చేసిన చట్టాన్ని పరిగణనలోకి తీసుకుని కమిటీల ఏర్పాటుకు పురపాలక శాఖ ఆదేశాలు చేసింది. జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో వివిధ హోదాల్లో మహిళా ఉద్యోగులు, కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వారికి ప్రస్తుతం ఏర్పాటు చేయనున్న అంతర్గత కమిటీలు రక్షణ కల్పించేందుకు కృషి చేయనున్నాయి. వేధింపులను అరికట్టేందుకు ఏర్పాటు చేసే కమిటీలో సీనియర్ మహిళా ఉద్యోగిని ప్రిసైడింగ్ అధికారిగా నియమించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏదైనా పురపాలికలో సీనియర్ మహిళా ఉద్యోగి లేకపోతే ఇతర ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఒక సీనియర్ మహిళా ఉద్యోగిని ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించాల్సి ఉంటుంది. మరో ఇద్దరిని ఈ కమిటీలో సభ్యులుగా నియమించాల్సి ఉంటుంది. మహిళా చట్టాలపై అవగాహన, సామాజిక సేవ కార్యక్రమాల్లో పాల్గొనే వారికి సభ్యులుగా అవకాశమివ్వాలి. మహిళా సమస్యలపై పోరాటం చేసే ప్రభుత్వేతర మహిళ ఒకరికి కమిటీలో చోటు కల్పిస్తారు. మహిళా ఉద్యోగులను ఎవరైనా వేధిస్తే ఈ కమిటీ విచారణ చేసి చర్యలు తీసుకుంటుంది. అవసరమైతే ఉన్నతాధికారులకు పూర్తి నివేదిక సమర్పించి వేధింపులకు కారకులైన వారిపై చర్యలు తీసుకునేలా తోడ్పాటునందిస్తుంది. అంతర్గత కమిటీల ఏర్పాటుతో మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న మహిళలకు పూర్తి స్థాయిలో రక్షణ లభిస్తుందని విశ్వసిస్తున్నారు.



నిర్మల్ మున్సిపల్ కార్యాలయం

నెలాఖరులోగా కమిటీల ఏర్పాటు



మున్సిపాలిటీలో వేధింపులను అరికట్టేందుకు మహిళా కమిటీలను ఏర్పాటు చేయాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి డి.దివ్య ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఎన్నికల కారణంగా కమిటీని ఏర్పాటు చేయలేకపోయాం. ఈ నెల చివరిలోగా కమిటీని ఏర్పాటు చేస్తాం.

– సీవీఎస్.రాజు, మున్సిపల్ కమిషనర్, నిర్మల్

న్యూస్‌రీల్

గడువులోగా సీఎంఆర్ పూర్తి చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రతీ మిల్లరు నిర్దేశించిన గడువులోగా సీఎంఆర్ పూర్తిచేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీఎంఆర్ సరఫరాపై సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లతో గురువారం సమీక్ష నిర్వహించారు. సీఎంఆర్ సరఫరాలో నిర్లక్ష్యం వహించే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిల్లుల వారీగా ధాన్యం నిల్వ సామర్థ్యం, నిర్దేశిత సీఎంఆర్ లక్ష్యం, పూర్తిచేసిన సరఫరా, నిల్వ ఉన్న ధాన్యం, రోజువారీగా తరలిస్తున్న ధాన్యం లారీల వివరాలను మిల్లుల వారీగా సమీక్షించారు. రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులు క్షేత్ర స్థాయిలో మిల్లులను తనిఖీ చేసి సీఎంఆర్ ప్రక్రియ తీరు, మిల్లులో ధాన్యం నిల్వలు తదితర అంశాలను పరిశీలించి రోజువారీ నివేదికలను అందజేయాలన్నారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఆర్వో భుజంగరావు, డీఎస్‌వో నందిత, తహసీల్దార్లు, అధికారులు, మిల్లర్లు పాల్గొన్నారు.

పసుపు సాగు షురూ..



పసుపు విత్తనం వేస్తున్న యువ రైతు ప్రశాంత్

లక్ష్మణచాంద: జిల్లాలో ఖరీఫ్ సాగు మొదలైంది. లక్ష్మణచాంద మండలం రాచాపూర్ గ్రామంలో రైతులు పసుపు విత్తే పనులు గురువారం ప్రారంభించారు. వర్షాలు కురవక ముందే గ్రామానికి చెందిన రైతు ప్రశాంత్ తన చేనులో పసుపు, మొక్కజొన్న విత్తనాలు వేశారు. రోహిణి కార్తెలో విత్తుకుంటే పంటలకు చీడపీడలు సోకవని, తెగుళ్లను పంటలు తట్టుకుంటాయని ప్రశాంత్ తెలిపాడు. తనకు నీటి సౌకర్యం ఉండడంతో సాగు మొదలు పెట్టానని చెప్పాడు.

108 సేవలు సద్వినియోగం చేసుకోవాలి



అంబులెన్స్‌ను తనిఖీ చేస్తున్న రవికుమార్

దిలావర్‌పూర్: 108 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని 108 సర్వీసు ప్రోగ్రాం అధికారి రవికుమార్ సూచించారు. దిలావర్‌పూర్ 108 అంబులెన్స్‌ను గురువారం తనిఖీ చేశారు. వాహనంలో అత్యవసర సమయంలో వినియోగించే పరికరాలను పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. రికార్డులు పరిశీలించారు. సమాచారం అందిన వెంటనే ప్రజలకు సత్వర సేవలు అందించాలని ఆదేశించారు. ఇందులో జిల్లా పర్యవేక్షకుడు మధు, ఈఎంటీ ఆనంద్‌కుమార్, పైలెట్ యహీముల్లాఖాన్ ఉన్నారు.

మత గ్రంథాన్ని అవమానించిన వ్యక్తిపై ఫిర్యాదు



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఖానాపూర్: మత గ్రంథాన్ని కాలితో తొక్కి అవమానించిన వ్యక్తిని శిక్షించాలని పట్టణానికి చెందిన షేక్ రైస్ పలువురు నాయకులతో కలిసి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. యూట్యూబర్ సదాకత్ అలీ అలియాస్ సిద్ధార్థ్ చతుర్వేదిపై చర్య తీసుకోవాలని కోరారు. మత విశ్వాసాన్ని దెబ్బతీసేలా వ్యవహరించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన వెంట ఖాజా, హఫీజ్ బిలాల్, జియా, సయ్యద్ అబీద్ తదితరులు ఉన్నారు.

'బడిబాట'తో ప్రవేశాలు పెంచాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్


నిర్మల్‌చైన్‌గేట్: బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బడిబాట, అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతి, యూనిఫాంల తయారీపై సంబంధిత శాఖల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. జూన్ 3 నుంచి 19వ తేదీ వరకు మూడు విడతల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెంచాలన్నారు. కార్యక్రమ ప్రారంభం రోజు అన్ని గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి కరపత్రాలు, ఫ్లెక్సీలు, పోస్టర్ల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేరితే కలిగే లాభాలు, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు సాధించిన ఉత్తమ ఫలితాలను గురించి తల్లిదండ్రులు, ప్రజలకు తెలియజేయాలని వివరించారు. గ్రామస్థాయిలో ఎంఈవోలు, ఎంపీడీవోలు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్, స్వయం సహాయక బృందాల సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసే పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంలు, డిజిటల్ విద్య, ఉపకార వేతనాలు, ఇతర ప్రోత్సాహకాల గురించి తెలియజేయాలన్నారు.బాల కార్మికులను గుర్తించి ప్రభుత్వ బడుల్లో చేర్పించాలన్నారు. పాఠశాలల పునఃప్రారంభం రోజే విద్యార్థులకు పంపిణీ చేసేందుకు నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. యూనిఫాంలు కూడా సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. జూన్ 12న స్వాగత దినోత్సవం, అమ్మ ఆదర్శ పాఠశాల దినోత్సవంగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు పుస్తకాలు, ఒక జత యూనిఫాం అందించాలని తెలిపారు. కొత్తగా చేరిన వారికి పాఠశాలల్లోనే సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనుల గురించి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పనులన్నీ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. యూనిఫాం స్టిచింగ్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పూర్తయిన, పెండింగ్‌లో ఉన్న యూనిఫాం వివరాలపై మండలాలవారీగా సమీక్షించారు. నిర్ణీత గడువులోగా దుస్తుల తయారీ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, డీఈవో రవీందర్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, జెడ్పీ సీఈవో గోవింద్, జిల్లా పంచాయతీరాజ్ అధికారి శ్రీనివాస్, ఎంఈవోలు, ఎంఎంవోలు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, మండల ప్రత్యేక అధికారులు, ఇతర అధికారు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పక్కన అదనపు కలెక్టర్, డీఈవో, డీఆర్డీవో

ప్రభుత్వ పాఠశాలల ప్రచారం షురూ..

ఖానాపూర్: జూన్ 3వ తేదీ నుంచి చేపట్టే బడిబాట కార్యక్రమానికి ముందే పలు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం ప్రారంభించారు. మండలంలోని దిలావర్‌పూర్ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం రాఘవేంద్రవర్మ గతేడాది పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించి గురుకుల శిక్షణను అందించారు. దీంతో ఐదుగురు విద్యార్థుల్లో నలుగురు 2024–25 విద్యాసంవత్సరానికి గురుకుల పాఠశాలలకు ఎంపికయ్యారు. ఇదే విషయాన్ని కరపత్రాల ద్వారా ఉపాధ్యాయుడు సామాజిక మాధ్యమాల్లో ప్రచారాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా కల్పిస్తున్న మౌలిక వసతులు, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం, తదితర వివరాలను కరపత్రంలో వివరించారు. ప్రైవేట్ పాఠశాలల తరహాలో ప్రభుత్వ పాఠశాలలో అదనపు ప్రత్యేకతలు సైతం కరపత్రంలో వివరించారు. వీటన్నింటితోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారికి ఉచితంగా పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫాంలతోపాటు రుచికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తామని పేర్కొన్నారు. దిలావర్‌పూర్ పాఠశాలలో 1 నుంచి 7వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమం, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకారవేతనాల సౌకర్యం, గురుకుల, నవోదయ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని తెలిపారు.



విద్యార్థుల ఫొటోలతో ముద్రించిన కరపత్రం

పకడ్బందీగా గ్రూప్–1 ప్రిలిమ్స్

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: జూన్ 9న గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. ఈమేరకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రూప్–1 పరీక్ష నిర్వహణపై నోడల్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. నిర్మల్ పట్టణంలో 13 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్ష నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్లు, అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులను ఉదయం 9 నుంచి అనుమతిస్తారని తెలిపారు. 10 గంటల తర్వాత గేట్లు మూసేస్తారని పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల నుంచి బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు తీసుకుంటారన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులతోపాటు సిబ్బంది మొబైల్ ఫోన్స్, చేతి గడియారాలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, ఆభరణాలు, బూట్లుకు అనుమతి లేదని తెలిపారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ఒరిజినల్ గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. అభ్యర్థులు, సిబ్బంది తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఫర్నిచర్, తాగునీటి సౌకర్యంతోపాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలని ఆదేశించారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. పరీక్ష పత్రాలు ఇతర సామగ్రి తరలించే క్రమంలో రూట్ ఆఫీసర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసు శాఖ పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్పీ జానకీషర్మిల మాట్లాడుతూ అవాంఛనీయ ఘటనలు జరుగకుండా, ప్రశాంతంగా గ్రూప్–1 ప్రిలిమ్స్ నిర్వహించేలా పోలీస్ శాఖ అన్ని చర్యలు చేపట్టిందని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, డీఎస్పీ గంగారెడ్డి, ఆర్డీవో రత్నకళ్యాణి, డీఎంహెచ్‌వో ధనరాజ్, పరీక్షల ప్రాంతీయ సమన్వయకర్త గంగారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిబంధనలు పాటించని డీలర్లపై చర్యలు

నిర్మల్‌చైన్‌గేట్: నిబంధనలను పాటించని డీలర్లపై తక్షణం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీ జానకీ షర్మిలతో కలిసి వ్యవసాయ శాఖ అధికారులు, డీలర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మినా, ఎరువులు, విత్తనాల కొరత సృష్టించినా సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతీ దుకాణంలో తప్పనిసరిగా స్టాక్, అమ్మకాల వివరాలు ప్రదర్శించాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మేవారిపై నిఘా ఉంచాలని తెలిపారు. అవసరమైతే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలన్నారు. వ్యవసాయ అధికారులు నిరంతరం ఫర్టిలైజర్ దుకాణాలు తనిఖీలు నిర్వహిస్తూ రైతులకు సక్రమంగా విత్తనాలు అందేలా చూడాలన్నారు. రైతులుపంటలు ఎంపిక చేసుకునేలా వ్యవసాయ అధికారులు అవగాహనా కల్పించాలన్నారు. జిల్లాలో 1.55 లక్షల ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగుచేసే అవకాశం ఉందని తెలిపారు. దీనికి 3.20 లక్షల విత్తన సంచులు అవసరమవుతాయని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలో 3.09 లక్షల విత్తన సంచులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. 3,500 క్వింటాళ్ల జీలుగు విత్తనాలు జిల్లా రైతులకు కేటాయించగా, ఇప్పటికే 2020 క్వింటాళ్ల విత్తనాలు సరఫరా చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 1,438 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేశామన్నారు. ఎస్పీ జానకీ షర్మిల మాట్లాడుతూ నకిలీ విత్తనాల సరఫరాపై నిఘా ఉంచామని తెలిపారు. బాధ్యులపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు వచ్చే నకిలీ విత్తనాల సరఫరాను నియంత్రించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. రీజినల్ మేనేజర్ అతుల్‌జైన్, డీఏవో అంజిప్రసాద్, వ్యవసాయ, పోలీసు శాఖల అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

పచ్చదనం పరిచేద్దాం

- 10వ విడత హరితహారానికి ఏర్పాట్లు
- ఈ ఏడాది 30.87 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

నిర్మల్‌చైన్‌గేట్: పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ఏటా హరితహారం నిర్వహిస్తోంది. ఇందుకోసం ఏటా వేసవిలో రూ.లక్షలు వెచ్చించి నర్సరీల్లో మొక్కలు పెంచుతోంది. వాటిని వర్షాకాలం ప్రారంభంలోనే నాటించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు 9 విడతల్లో హరితహారం నిర్వహించగా, పదో విడత కార్యక్రమానికి అధికారులు సిద్ధమవుతున్నారు. ఈమేరకు శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు.

72 రకాల మొక్కలు సిద్ధం..
ఇప్పటికే జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేస్తున్నారు. 35.08 లక్షల మొక్కలు నాటాలని అధికార యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఏడాది 70 నుంచి 80 రకాల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.



నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి

ఒక్కో నర్సరీలో 13 వేల మొక్కలు..
జిల్లాలోని 396 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పథకంలో భాగంగా 396 నర్సరీలు ఏర్పాటు చేశారు. పంచాయతీకి ఒక నర్సరీ ఏర్పాటు చేసి ఒక్కో నర్సరీలో సుమారు 13 వేల మొక్కలు పెంచుతున్నారు. ఇందుకోసం నర్సరీకి సుమారు రూ.1.40 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. నర్సరీల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతను పంచాయతీలకు అప్పగించారు.

ప్రతీ మొక్కను సంరక్షిస్తాం..
హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటేందుకు ఇప్పటికే ప్రణాళిలు రూపొందించాం. జిల్లాలోని 396 నర్సరీల్లో 51.48 లక్షల మొక్కలు పెంచుతున్నాం. హరితహారం కార్యక్రంలో భాగంగా నాటునున్న ప్రతీ మొక్కను సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

– విజయలక్ష్మి, డీఆర్డీవో

శాఖల వారీగా నాటనున్న మొక్కల వివరాలు

శాఖ	నాటనున్న మొక్కలు	వైద్య ఆరోగ్యశాఖ	19,838
అటవీశాఖ	3,96,750	ఉద్యానవనం	79,350
నిర్మల్ మున్సిపాలిటీ	3,17,400	సంక్షేమ శాఖ	7,935
భైంసా మున్సిపాలిటీ	317400	పరిశ్రమలు	3,968
ఖానాపూర్ మున్సిపాలిటీ	158700	ఉన్నత విద్యాశాఖ	7,935
వ్యవసాయ శాఖ	2,38,050	మార్కెటింగ్ శాఖ	3,968
డీఆర్డీవో	1,58,000	గనులు, భూగర్భ జలాలు	7,935
విద్యాశాఖ	6,348	మైనార్టీ శాఖ	3,968
పశుసంవర్ధకం	4,761	ఎన్‌హెచ్ఏఐ	11,903
బీసీ సంక్షేమ	3,968	పోలీసు శాఖ	1,19,025
పౌరసరఫరాలు	1,587	రోడ్లు భవనాల శాఖ	7,935
సహకార శాఖ	6,613	రెవెన్యూ	31,740
విద్యుత్	3,968	స్కూల్ ఎడ్యుకేషన్	7,935
దేవాదాయ	3,968	ట్రైబల్ వెల్ఫేర్	3,968
ఇంజనీరింగ్ శాఖ	3,968	యువజన శాఖ	3,968
ఎక్సైజ్	39,675	పంచాయతీరాజ్ శాఖ	11,903
మత్స్యశాఖ	39,675	ఇరిగేషన్	39,675

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ చెరువు కట్టపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదలో పలువురు గాయపడ్డారు. లక్ష్మణచాంద నుంచి నిర్మల్ వెళ్లే ఆటోలో రాచాపూర్ గ్రామానికి చెందిన పలువురు ప్రయాణికులు ఎక్కారు. ఆటో వడ్యాల్–రాచాపూర్ గ్రామాల మధ్య చెరువు కట్టపైకి వెళ్లగానే వడ్యాల్ వైపు నుంచి లక్ష్మణచాంద వైపునకు బైక్‌పై వస్తున్న వ్యక్తి ఆటోకు అడ్డుగా వచ్చాడు. ఆటో డ్రైవర్ పక్కకు తప్పించేక్రమంలో అదుపుతపిప పక్కకు పడింది. దీంతో ఆటోలో ఉన్న రాచాపూర్ గ్రామానికి చెందిన పలువురికి గాయాలయ్యాయి. వీరిని 108లో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇందులో బన్నెబోయిన భూమవ్వ(50) అనే మహిళకు చేయి విరగడంతోపాటు రెండు కాళ్లకు గాయాలయ్యాయి. భూసి రాజేశ్వర్(52) ఛాతీ భాగంలో దెబ్బతగిలింది. రంజని రాజవ్వ(40) తలకు గాయమైంది. రక్తస్రావం అయింది.

క్లుప్తంగా

ప్రైవేట్ ఆస్పత్రి తనిఖీ


మాట్లాడుతున్న డీడీఎంహెచ్ఓ సాధన

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిని డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన గురువారం తనిఖీ చేశారు. మోచిగల్లిలోని గైనిక్ ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించి పీసీపీ ఎన్‌డీటీ నిబంధనలను తప్పకుండా పాటించాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్పత్రి నిర్వహణకు సంబంధించిన సూచనలు జారీ చేశారు. ఆమె వెంట మాస్ మీడియా అధికారి వెంకట్‌రెడ్డి, వైద్యాధికారి అశోక్, తదితరులు ఉన్నారు.

విత్తన డీలర్‌పై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: రైతులను ఇబ్బందులకు గురిచేసిన విత్తన డీలర్‌పై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆదిలాబాద్ పట్టణంలోని తాంసి బస్టాండ్ ప్రాంతంలోని నిఖిల్ ఫర్టిలైజర్ షాపు యజమాని రాకేష్ రెడ్డిపై ఆదిలాబాద్‌అర్బన్ వ్యవసాయ శాఖ అధికారి రమేశ్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. షాపులో రాశి 659 సీడ్స్ ప్యాకెట్లు ఉన్నప్పటికీ నోస్టాక్ బోర్డు పెట్టి మ్యాక్స్ వాహనంలో ఇతర ప్రాంతానికి తరలిస్తుండగా రైతులు అడ్డుకున్నట్లు తెలిపారు. వ్యవసాయ అధికారుల ఆదేశాలు బేఖాతరు చేసినందుకు కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న ప్రభుత్వ ఉద్యోగి చిలుక పొచ్చన్న నివాసంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పొచ్చన్న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లాడు. గురువారం ఇంటికి వచ్చి చూసేసరికి తలుపుల తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. అనంతరం లోనికి వెళ్లి చూడగా 8 తులాల బంగారు, 9 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.5వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఆదిలాబాద్ పట్టణంలో..

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని శ్రీరాం కాలనీలో చోరీ జరిగింది. కాలనీకి చెందిన అశన్న రెండు రోజుల కిందట కుటుంబ సభ్యులతో కలిసి ఊరికి వెళ్లి గురువారం తిరిగి వచ్చారు. ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడం, బీరువాలోని రూ.5వేల నగదు, ఒక గ్రాము బంగారం చోరీకి గురైనట్లు గుర్తించి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

విద్యుత్ తీగపడి ఎద్దు మృతి

భీమారం: మండలంలోని దాంపూర్ గ్రామ సమీపంలోని మామిడి తోటలో గురువారం విద్యుత్ వైరు తెగి పడి ఎద్దు మృతిచెందింది. గ్రామానికి చెందిన చేగోండ నారాయణకు చెందిన ఎద్దు మేత కోసం తోటకు వెళ్తుండగా అకస్మాత్తుగా తీగ తెగిపోయి ఎద్దుపై పడింది. ఎద్దు విలువ రూ.50వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. విద్యుత్ శాఖ సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

కొత్త ఊళ్లో.. ఎట్ల బతుకుడు?



రాంపూర్, మైసంపేట్ పునరావాస కాలనీ

- ఇళ్లు ఇచ్చి చేతులు దులుపుకున్న అధికారులు
- సాగుకు యోగ్యంగా లేని భూముల కేటాయింపు
- సాగుకు సిద్ధం చేస్తామన్న హామీ మరిచిన వైనం..
- పరిహారం ఇవ్వాలంటున్న పునరావాస గ్రామస్తులు

కడెం: కవ్వాల్ టైగర్ జోన్‌లోని రాంపూర్, మైసంపేట్ వాసులు పులి మనుగడ కోసం ఊళ్లను ఖాళీ చేశారు. మండలంలోని కొత్త మద్దిపడగ సమీపంలో ఏర్పాటు చేసిన పునరావాస కాలనీకి వచ్చిన గ్రామస్తులకు అటవీ శాఖ ఇళ్లు, వ్యవసాయ భూమి అప్పగించింది. అయితే వ్యవసాయ భూమి పంటల సాగుకు యోగ్యంగా లేదు. వానాకాల సీజన్ సమీపిస్తున్నా భూములు సాగు చేసే పరిస్థితి లేదు. ఇళ్లు, భూమి వదిలి గ్రామలను ఖాళీ చేసి వచ్చిన తాము కొత్త ఊళ్లో ఎలా బతకాలని పునరావాస గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

సిద్ధం కానీ సాగుభూమి

రాంపూర్, మైసంపేట్ గ్రామల్లోని 94 కుటుంబాలకు ప్యాకేజీలో భాగంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు, 2.32 ఎకరాల వ్యవసాయ భూమి అప్పగించారు. పునరావాసకాలనీ కొత్త మద్దిపడగ సమీపంలో ఏర్పాటు చేయగా.. వ్యవసాయ భూమి మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ పంచాయతీ పరిధి పెత్తర్పు సమీపంలో అప్పగించారు. ఒక్కో కుటుంబానికి 2.32 ఎకరాల చొప్పున హద్దు రాళ్లు ఏర్పాటు చేశారు. అయితే ఆ భూమిని చదును లేకపోవడం, త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం, సాగు నీటి వసతి లేకపోవడంతో పంటలు వేసే పరిస్థితి లేదు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా భూమి చదును చేయడం లేదని


పెత్తర్పు సమీపంలో వ్యవసాయ భూమి

పేర్కొంటున్నారు. భూమిని సాగుకు సిద్ధం చేసే వరకూ తమకు పరిహారం చెల్లించాలని పునరావాస గ్రామాల గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా కొంత కాలంగా ఆ వ్యవసాయ భూమి తమకే దక్కాలని ఆందోళన చేస్తున్న నచ్చన్‌ఎల్లాపూర్ గొండుగూడ వాసులు ఇటీవలే వ్యవసాయ భూమి హద్దురాళ్లు విరగొట్టారు.

భూమి కాడ లొల్లి



మాకు ఇచ్చిన భూమిలోకి పోతే మా భూమి అని పక్క గూడెపోల్లు లొల్లి జేస్తుండ్రు. కని బండలు ఇరగొడుతున్నరు. పీకి పారేస్తున్నారు. రాళ్లు రప్పలు ఉన్న భూమి ఇస్తే పంటలు ఎట్ల పండించాలె. మేమెట్ల బతకాలె.

– గాదె బుచ్చవ్వ

పరిహారం ఇవ్వాలి



అన్నీ సిద్ధం చేశాకే ఊళ్లు ఖాళీ చేయిస్తామన్న అధికారులు హడావుడిగా తరలించారు. ఇక్కడ చేసుకోవడానికి పని లేదు. భూమి చదును, త్రీఫేజ్ విద్యుత్, నీటి సౌకర్యం కల్పించే వరకు పరిహారం చెల్లించాలి.

– ప్రవీణ్

ఆందోళన చెందొద్దు



పునరావాస గ్రామస్తులకు కేటాయించిన వ్యవసాయ భూమి పట్టాలు ప్రింట్ అవుతున్నాయి. డీఆర్డీవో, ఐటీడీఏ నుంచి బావుల తవ్వకం, విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. భూమి చదును, రాళ్ల తొలగింపు అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం.

– అనిత, ఎఫ్ఆర్వో, కడెం

అమెరికా సభల్లో ఖానాపూర్ యువకుడి ప్రతిభ


పోటీల్లో పాల్గొన్న జనార్దన్ కుమారుడు

ఖానాపూర్: తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ మహాసభలను అమెరికాలోని సియాటిల్ మహా నగరంలో ఘనంగా నిర్వహించారు. సుమారు 10 వేల మందికిపైగా హాజరైన ఈ సభలో సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు ప్రతిభాపోటీలు, ఫ్యాషన్‌షో, వాక్ కాంపిటీషన్ తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా బిగ్‌బాస్ విన్నర్ కౌశల్ మంద, అశ్విని, యాక్టర్ మెహ్రిన్ వ్యవహరించారు. ఇందులో ఖానాపూర్ మండలం సింగాపూర్ గ్రామానికి చెందిన మహాసభల నిర్వాహకుడు పన్నెల జనార్దన్ పాల్గొన్నారు. జనార్దన్ కుమారుడు విఖ్యాత్ రాణా సైతం పోటీల్లో పాల్గొని అత్యధిక మార్కులు సాధించడంతోపాటు మిస్టర్ టీన్ విభాగంలో విన్నర్‌గా నిలిచాడు. అట్లాంటా నగరంలోని సభల్లో ప్రవాస భారతీయుడు ప్రతిభ కనబర్చడాన్ని పలువురు అభినందించారు.

అంతర్జాతీయ కర్రసాములో ప్రతిభ


కర్రసాములో ప్రతిభ కనబర్చిన యువకుడు

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామానికి చెందిన బోసు సుమ–నర్సయ్య దంపతులకుమారుడు సంతోష్ మలేసియాలోని సెపాంగ్‌లో ఈనెల 28న జరిగిన కర్రసాము పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించాడు. నెల క్రితం చెన్నైలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మలేసియాలో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ కర్రసాము పోటీల్లోని కుతువరసాయి విభాగంలో రెండోస్థానంలో నిలిచాడు. ఇంటర్నేషనల్ టెక్నికల్ కమిటీ చైర్మన్ మాస్టర్ చంద్రన్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నాడు.

హార్టికల్చర్ అకౌంటెంట్ రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: హార్టికల్చర్ అండ్ సెరికల్చర్ శాఖలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్న దెబ్బటివార్ సంజీవ్ కుమార్‌ను గురువారం రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు. రైతుల బిందుసేద్యం పరికరాలకు సంబంధించిన డీడీలను తన సొంతఖాతాలోకి మళ్లించుకున్నాడని మార్చి 7న జిల్లా హార్టికల్చర్ అధికారిగా పనిచేసిన శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు చేశారు. రూ.కోటి 79 లక్షల 88,832 కాజేసినట్లు పేర్కొన్నారు. అతని వద్ద నుంచి రూ.2లక్షల నగదును రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

బాసరలో భక్తుల రద్దీ


ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

భైంసాటౌన్: వేసవి సెలవులు త్వరలో ముగియనుండడంతో బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనానికి భక్తులు భారీగా తరలి వస్తున్నారు. గురువారం అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి దాదాపు రెండు గంటల సమయం పట్టింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్న భక్తులు తర్వాత చిన్నారులతో అక్షర శ్రీకార పూజలు చేయించారు.

ఓర్వలేకనే విత్తన కొరత రాజకీయం

- కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి


మాట్లాడుతున్న కంది శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపాలనను ఓర్వలేకనే బీఆర్‌ఎస్, బీజేపీ విత్తన కొరత పేరిట రాజకీయం చేస్తున్నాయని కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు ఒకే రకం విత్తనాలు కోరుకుంటుండటంతో దుకాణాల వద్ద రద్దీ ఎక్కువైందన్నారు. ఎవరికీ ఇబ్బంది కలగకుండా పోలీసులు వారిని క్యూలో నిలబెడితూ లాఠీచార్జి చేసారని విపక్షాలు ఆరోపించడం దుర్మార్గమన్నారు. ప్రజల మద్దతును చెడగొట్టేందుకే ఆ రెండు పార్టీలు రైతులను తప్పుదోవ పట్టించి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. పెన్‌గంగ పరీవాహక ప్రాంతంలో జరుగుతున్న ఇసుక దందాలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల తనయులే అక్రమార్కుల్లా వ్యవహరిస్తున్నారన్నారు. రైతులు అధైర్యపడవద్దని, వ్యవసాయశాఖ మంత్రితో మాట్లాడి అదనంగా పత్తి విత్తన ప్యాకెట్లు తెప్పిస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు నగేష్, సాయిచరణ్ గౌడ్, శ్రీలేఖ, భోజారెడ్డి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

నలుగురు దోపిడీ దొంగల అరెస్టు

- సినీ ఫక్కీలో బాధితుడినే దొంగగా చిత్రీకరించిన కేటుగాళ్లు
- నిందితుల నుంచి కారు, ఆటో, నగదు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: జల్సాలకు అలవాటుపడి దోపిడీలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ గౌస్ ఆలం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణంలోని వడ్డెర కాలనీకి చెందిన మిర్జా ముషరఫ్, షేక్ బిలాల్, గబ్బె అక్షయ్, జైనథ్ మండలంలోని రామాయి గ్రామానికి చెందిన మెస్రం దత్తు గంజాయి మాదకద్రవ్యాలకు అలవాటుపడి డబ్బుల కోసం హత్యలు, దోపిడీలు, దొంగతనాలు, వాహనాల చోరీకి పాల్పడుతున్నారు. ఈ నెల 25న ఆదిలాబాద్ బస్టాండ్ సమీపంలో గల ఓ బార్ వద్ద ఓ అమాయకుడి వద్ద డబ్బులు ఉన్నాయని గ్రహించి ఆటో డ్రైవర్ సహాయంతో బాధితుడినే దొంగగా చిత్రీకరించారు. ఆటోలో కూర్చోబెట్టి పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్తామని నటిస్తూ ప్రజలకు అనుమానం రాకుండా జాగ్రత్త పడ్డారు. బాధితుడు రాకపోయేసరికి అతనిపై దాడికి పాల్పడి రూ.10వేల నగదు లాక్కెళ్లగా ఈ దృశ్యాలన్నీ సీసీపుటేజీలో రికార్డయ్యాయి. ఈనెల 13న రైల్వే స్టేషన్ సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి నోరు నొక్కి బలవంతంగా కారులో ఎక్కించుకున్నారు. సెల్‌ఫోన్, డబ్బులు లాక్కున్నారు. మహారాష్ట్ర వైపు తీసుకెళ్తూ మార్గమధ్యలో ఉండం వద్ద వాహనం ఆపడంతో అక్కడి నుంచి సదరు వ్యక్తి తప్పించుకున్నాడు. గతంలో తాంసి మండలం వడ్డాడి ప్రాజెక్ట్ వద్ద ఓ బాలున్ని కిడ్నాప్ చేసి ప్రాజెక్టులో పడేసి హత్యకు పాల్పడ్డారు. బైక్‌ను విక్రయించారు. ఈ కేసులో ఏ–1గా ఉన్న మిర్జా ముషరఫ్, ఏ–2గా ఉన్న షేక్ బిలాల్‌లపై దాదాపు 20 కేసుల వరకు నమోదయ్యాయి. నిందితుల వద్దనుంచి స్విఫ్ట్ కారు, ఆటో, సెల్‌ఫోన్‌తో పాటు రూ.4వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కాగా దొంగలించిన సెల్‌ఫోన్‌ను ఆదిలాబాద్‌లోని మొబైల్ షాప్‌లో విక్రయించగా యజమాని జాహిద్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు. చోరీలకు గురైన ఫోన్లను ఎవరూ కొనుగోలు చేయవద్దని సూచించారు. దొంగలను పట్టుకున్న పోలీసు సిబ్బంది రమేశ్, నరేష్, క్రాంతి, నరేందర్, సుధాకర్‌రెడ్డిని ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు. సమావేశంలో డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, సీఐలు సత్యనారాయణ, అశోక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆనంద్‌పూర్ పెన్‌గంగలో రైడ్

- ఇసుక తవ్వకాలకు ఉపయోగించే పరికరాలు సీజ్


జైనథ్‌లో సీజ్ చేసిన పరికరాలతో అధికారులు

జైనథ్/బేల: మండలంలోని ఆనంద్‌పూర్ గ్రామ సమీపంలోని పెన్‌గంగలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు గురువారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఎస్సై పురుషోత్తం, ఆర్ఐ నితిన్, మైనింగ్ టీఏ రమేశ్ నదిలో దిగి ఇసుక తవ్వకాలను పరిశీలించారు. తవ్వకాల కోసం ఉపయోగిస్తున్న పరికరాలను సీజ్ చేసారు. నది మధ్యలో ఇసుక తవ్వకాలకు వాడే భారీ బోట్ ఉండటంతో దాని కనెక్షన్ తొలగించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతి


నువ్వుల రణధీర్ (ఫైల్)

ఖానాపూర్: మండలంలోని బాదన్‌కుర్తి గ్రామంలో గురువారం ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతిచెందారు. ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. బాదన్‌కూర్తి గ్రామానికి చెందిన నువ్వుల రణధీర్ గ్రామంలోని పెట్రోల్ బంక్‌లో తన ద్విచక్రవాహనంలో పెట్రోల్ పోసుకుని రోడ్డు క్రాస్ చేస్తుండగా ఆర్టీసీ బస్సు వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రణధీర్‌ను చికిత్స కోసం నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. రణధీర్ సోదరుడు రణవీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విత్తన గోదాముల్లో తనిఖీలు


ఆదిలాబాద్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని పత్తి విత్తన గోదాములను గురువారం రాత్రి పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యవసాయ మార్కెట్ ప్రాంతం వెనుకాల గల పలు గోదాముల్లో డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, టూటౌన్ సీఐ అశోక్, ఆదిలాబాద్‌అర్బన్ వ్యవసాయ అధికారి రమేశ్ స్టాక్ రిజిస్టర్లు, నిల్వ ఉన్న విత్తనాలను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇచ్చోడ: మండలంలో గురువారం తహసీల్దార్ తుకారాం, ఏవో కైలాస్, ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో పలు గోదాములను తనిఖీ చేశారు. నవత, రాయల్, ట్రాన్స్‌పోర్టులతో పాటు ఫర్టిలైజర్ గోదాముల్లో తనిఖీలు నిర్వహించారు. వారి వెంట ఏఈవోలు ఉదయ్‌కిరణ్, ప్రవీణ్, తదితరులు ఉన్నారు.

మల్కుపల్లిలో 'మెస్రం' కోడళ్ల భేటీ


భేటీలో పాల్గొన్న మెస్రం వంశ కోడళ్లు

తాంసి: తలమడుగు మండలం లక్ష్మీపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మల్కుపల్లిలో గురువారం సంప్రదాయబద్ధంగా మెస్రం వంశీయుల కొత్త కోడళ్ల భేటీ నిర్వహించారు. 260 నూతన జంటలతో పాటు మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి 96 గ్రామాల మెస్రం వంశీయులు పాల్గొన్ని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో (పెర్సపేన్) కార్యనిర్వాహక అధ్యక్షులు మెస్రం సంతోష్, కటోడల్ మెస్రం శంకర్, పేన్ పటేల్, మెస్రం మారు, గ్రామపటేల్ మెస్రం భీంరావు, మహాజన్ వేర్కడ్ జ్యోతిరాం, మాజీ సర్పంచ్ రాధ మనోహర్, గిరిజనులు పాల్గొన్నారు.

కర్రలతో చేపల వేట



ముధోల్: చేపలను సాధారణంగా గాలంతో లేదా వలతో పడుతుంటారు. కానీ, ముధోల్ సమీపంలోని కొరిగల్లీ చెరువులో సుమారు 150 మంది యువకులు ఇలా కర్రలతో వేటాడారు. ఈ చెరువంతా తామర పూల వనం ఉంది. దీంతో దీంట్లో వలలతో చేపలు పట్టడం వీలు కాదు. ఎండలకు చెరువులో నీళ్లు తగ్గిపోవడంతో గురువారం స్థానికులు సుమారు 150 మంది కర్రలు పట్టుకుని ఇలా చేపలవేట సాగించారు. దీంతో చెరువంతా సందడి కనిపించింది. సుమారు 3 క్వింటాళ్ల చేపలు పట్టారు. వాటిని రూ.100కు ఒకటి చొప్పన విక్రయించారు.

భానుడి సెగ... రక్షణ లేకుంటే వ్యథ




జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలుగా నమోదవుతున్నాయి. దీంతో ఎండల తీవ్రత భగ్గుమంటోంది. భానుడి భగభగల ప్రభావం మనుషులకే కాదు కూరగాయలు, వాహనాలపైనా ప్రభావం చూపిస్తోంది. ఎండ తీవ్రతకు చెడిపోకుండా ఉండాలని కూరగాయల విక్రయదారులు గ్రీన్‌మ్యాట్‌తో కప్పుతుండగా, ద్విచక్రవాహనాలకు తెల్లని వస్త్రాలను కప్పి కాపాడుకుంటున్న ఈ దృశ్యాలు ఆదిలాబాద్ జిల్లాలోని ఎండల తీవ్రతకు అద్దం పడుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్